క్లుప్తంగా

పరివర్తన పాఠశాలకు నిత్యావసరాల అందజేత



సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలకు అమెరికాకు చెందిన పున్నా శ్రీదేవి కుమార్తె అమృత అందించిన రూ. 10 వేలుతో చిలకలూరిపేటకు చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా బుధవారం నిత్యావసర వస్తువులను అందజేశారు. 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిపప్పు, 10 కేజీల శనగ నూనె, 30 మంది చిన్నారులకు టవల్స్, స్నాక్స్ అందించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సరోజిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరివర్తన సంస్థకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నార్నె జయలక్ష్మి, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి, దండా రమాదేవి, పాల్గొన్నారు. దాతలకు పరివర్తన నిర్వాహకుడు కె.కిశోర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

క్రోసూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయ ప్రసాదరావు



క్రోసూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.విజయప్రసాదరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డి.భాస్కరరావు పెదకాకానికి బదిలీ అయ్యారు. ఆయనతో పాటు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

మాదిగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా బుజ్జిబాబు



సత్తెనపల్లి: మాదిగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా అనపర్తి బుజ్జిబాబు నియమితులయ్యారు. పల్నాడు జిల్లా మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడిగా అనపర్తి బుజ్జిబాబుని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.అనంతరం సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి నాగేశ్వరరావు నుంచి బుజ్జిబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు.

వైద్య రంగలో ఫార్మాసిస్ట్‌ల పాత్ర కీలకం



క్రోసూరు: వైద్యులు రాసిన మందులను అర్థం చేసుకొని సరియైన వాటిని వ్యాధిగ్రస్తులకు ఇవ్వడంలో, చికిత్సలో ఫార్మాసిస్ట్‌ల పాత్ర కీలకమని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖ శాంసన్ అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా బుధవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న ఫాతిమాకు ఆయన సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాంసన్ మాట్లాడుతూ ఫార్మాసిస్ట్‌లు వైద్య రంగ వ్యవస్థల్లో అంతర్భాగమని, ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చడంలో వారిది ముఖ్యపాత్రని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జ్యోతి, స్టాఫ్ నర్స్ రాణి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకరరావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల, నవోదయ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ మాట్లాడుతూ మండలంలో రెండేళ్ల నిండి 19 ఏళ్లలోపు పిల్లలు 8,550 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను అందజేస్తామని చెప్పారు. పురుగులు ఉండడం వల్ల పిల్లల్లో రక్తహీనత ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు తప్పకుండా ఆల్బెండాజోల్ మాత్రల్ని వారితో మింగించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, హెచ్‌ఎం శైలజ, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మీదుర్గ, హన్నాకుమారి, శిరీష, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగుతో పత్తికి తీవ్ర నష్టం

- జిల్లా వ్యవసాయాధికారి మురళి
- రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సూచన



గోళ్లపాడు రైతుభరోసా కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

గోళ్లపాడు(ముప్పాళ్ల): పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలను చేపట్టాలని, లేనిపక్షంలో తీవ్ర నష్టం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని గోళ్లపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు నివారించేందు వ్యవసాయశాఖ రైతులకు లింగాకర్షక బుట్టలు అందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, వ్యవసాయ పరికరాలు గురించి వివరించారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలో తీసుకోవాల్సిన సమగ్ర, పోషక, సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు వివరించారు. కార్యక్రమంలో భాగంగా పత్తి, వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో పి. ప్రవీణ్, వీఏఏ డేవిడ్‌రాజు, పావని, వీఆర్వో దాసు, రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

క్రోసూరు: రైతులంతా పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని ఏడీఏ వి.హనుమంతరావు కోరారు. మండలంలోని బయ్యవరం, నాగవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలైన పశు సంవర్ధకం, ఉద్యానం, మార్కెటింగ్ శాఖలతో పాటు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అధికారులు, అగ్రికల్చరల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సభల్లో పాల్గొంటారని తెలిపారు. సాగులో ఉన్న పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తారని చెప్పారు. తద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, నికర ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. ఈ-పంట నమోదు, కౌలుదారులకు గుర్తింపు కార్డులు, పీఎం కిసాన్ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ గురించి ఏవో వేణుగోపాల్ వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ప్రమీలారాణి, బయ్యవరం గ్రామ సర్పంచ్ చెన్నవరపు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

బెట్ట వాతావరణంతో పురుగుల ఉధృతి

అచ్చంపేట: బెట్ట వాతావరణం వల్ల పత్తిలో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని ఏవో పి.వెంకటేశ్వర్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయి, పుట్లగూడెం గ్రామాల్లో బుధవారం ఆయన పత్తి పంటలను పరిశీలించారు. పలుచోట్ల పేనుబంక, తామర పురుగు, తెల్లదోమ, పచ్చదోమలను గుర్తించారు. వాటిని నివారించే పద్ధతులను రైతులకు వివరించారు. పంటల మార్పిడిని పాటించాలని చెప్పారు. ఏటా ఒకే రకమైన పంటలు వేయడం వల్ల ఆశించిన ఫలితాలు రావని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పంటలు వేసుకోవడం మంచిదని తెలిపారు. పంటల మార్కెటింగ్ గురించి మార్కెటింగ్ శాఖ ఉద్యోగి గోపి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగశివనాయక్, శ్రీనునాయక్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పత్తిలో రసం పీల్చు పురుగులు, గులాబీ రంగు పురుగుల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు మండల వ్యవసాయ అధికారి ఐ. శాంతి అవగాహన కల్పించారు. పత్తిలో పూత, కాయ రాలకుండా బోరాన్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ఆవశ్యకత గురించి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కన్నెగండ్ల గ్రామ సర్పంచ్ కోరంపల్లి వెంకట్రామయ్య, వట్టికూటి శివయ్య, గ్రామ ఉద్యాన సహాయకులు వి. మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగబడులు

బెల్లంకొండ: యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని ఎమ్మాజీగూడెం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాలలో పత్తి, కంది పంటలను వ్యవసాయాధికారి, సిబ్బంది పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.గాలికుంటు వాక్సిన్, కృత్రిమ గర్భధారణ, పశు పోషణ గురించి మండల పశువైద్యాధికారి బాలకృష్ణారెడ్డి రైతులకు వివరించారు. పామ్ ఆయిల్ తోటల యాజమాన్యం, పెంపకం, రాయితీలు, ఆదాయం గురించి పర్యవేక్షణ అధికారి నవీన్ తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది సాయికిరణ్, ఆశాబి పాల్గొన్నారు.

వరిలో పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

నకరికల్లు: వరి పైరు పిలక దశలో ఉన్నప్పుడు తాడుతో పైరుకు అడ్డంగా రెండు, మూడుసార్లు లాగడం ద్వారా మొక్కలకు ఉన్న పురుగులు రాలిపోతాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్ తండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆకుముడత, తెల్ల తెగులు పురుగు కన్పిస్తోందని తెలిపారు. వరి దుబ్బులో లార్వా గానీ రెండు లేక అంతకన్నా ఎక్కువ పురుగులు సోకితే నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. క్లోరోపైరిఫాస్ 500మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పశువులలో ఎద లక్షణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు, పశువుల బీమా, నేపియర్ గడ్డి పెంపకం తదితర అంశాలపై పశువైద్యాధికారి ఎస్.సుజాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడువాయిలో పత్తి పంటను పరీక్షిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు, రైతులు



బయ్యవరంలో మాట్లాడుతున్న ఏడీఏ వి.హనుమంతరావు

పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో, రైతులు

అమరావతి: ప్రతి రైతు పంట నమోదుతో పాటు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తెలిపారు. మల్లాది, దిడుగు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తి పొలాల క్షేత్ర సందర్శన అనంతరం వ్యవసాయాధికారి అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలకు అర్హులు కావాలంటే రైతులంతా పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖాధికారి శ్రీనిత్య మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మిరప నారులో వేరు వ్యవస్థను కాపాడాలని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మిరప నారు సాగులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధ శాఖాధికారి కె. వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి శివకుమారితో పాటు రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పెదకూరపాడు: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పంట పెట్టుబడి సహాయం రూ. 20వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో బుధవారం కలసి తహసీల్దార్ దానియల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శేషారావు మాట్లాడుతూ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంట పెట్టుబడి సాయంగా రూ. 6వేలు, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పేరుతో రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500 మూడు విడతలుగా ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం విధించిన నియమ, నిబంధనల వల్ల కౌలు రైతులు పెట్టుబడి సాయాన్ని పొందలేక పోయినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సహాయం రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని తెలిపారు. విధి విధానాలను ప్రకటించి, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు, వరదలతో నష్ట పోయిన పంటలకు నష్టపరిహారం, బీమా పరిహారం చెల్లించాలని కోరారు. ఈ క్రాప్‌లో నమోదు చేయని పంటలను కూడా గుర్తించి నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, లింగంగుంట్ల సర్పంచ్ సారెకుక్క వెంకటేశ్వర్లు, ప్రతినిధులు కాల్వ అప్పారావు, సరిపూడి వెంకటేశ్వర్లు, రావి వేణు, జయచంద్రారెడ్డి, వి. వెంకటరెడ్డి, బి. రత్తయ్య పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు మంచి అవకాశం

రాష్ట్ర కోఆర్డినేటర్ అక్బర్ అలీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అక్బర్ అలీ, ఎంఈఓ శ్రీనివాసరావు తదితరులు

సత్తెనపల్లి: పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యనభ్యశించడానికి ఓపెన్ స్కూలు మంచి అవకాశం అని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ అన్నారు. అడ్మిషన్ల పెంపుదల ప్రక్రియలో భాగంగా మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ సెంటర్‌ను బుధవారం సందర్శించి అడ్మిషన్ల ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ మండలాలు, పాఠశాలల వారీగా పదో తరగతి తప్పిన వారితో పాటు మధ్యలో బడి మానివేసిన వారి వివరాలను కోఆర్డినేటర్లకు అందించినట్లు తెలిపారు. వారిని సంప్రదించి అడ్మిషన్ చేయాలని కోరారు. అనంతరం సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఓపెన్ స్కూల్ సొసైటీ పోస్టర్‌ని ఆవిష్కరించారు. అడ్మిషన్‌ల ప్రక్రియను వేగవంతం చేయడంలో సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ పాఠశాలల, కళాశాలల కోఆర్డినేటర్లు, ఉపా . ధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

క్రోసూరు: స్థానిక జెడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో బుధవారం పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్- 17, అండర్- 14 బాలబాలికలకు ఖోఖో,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఏ. రామాంజనేయులు పోటీల్ని ప్రారంభించారు.అండర్- 17 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో అమరావతి ఎస్ఆర్‌కే పాఠశాల విద్యార్థి పి. మోబిన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ శ్రీధర్ తెలిపారు. అండర్ -17 బాలికల పరుగు పందెంలో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే పాఠశాల విద్యార్థిని ఎ. హన్సిక ప్రథమ, అండర్ -14 బాలుర లాంగ్ జంప్ విభాగంలో అచ్చంపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి టి. కళారాజు ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్- 14 బాలికల విభాగంలో నాగవరం జెడ్పీపాఠశాల విద్యార్థిని పి.గంగోత్రి ప్రథమ, అండర్- 17 బాలుర షార్ట్ పుట్ విభాగంలో అచ్చంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓ.అద్దెయ్యబాబు ప్రథమ, అండర్- 17 డిస్కస్ త్రో బాలికల విభాగంలో అచ్చంపేట కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఎం.కీర్తనబాయి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ శ్రీధర్ తెలిపారు. వీరంతా త్వరలో జరిగే జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్ సి.వి.నాగరాజు , నియోజకవర్గంలో పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్జాగా బస్సు షెల్టర్ ఆక్రమణ

- టీడీపీ నేత అరాచకం
- గోడ పగులగొట్టి రేకుల షెడ్ ఏర్పాటు



గోడను పగులగొట్టి ఏర్పాటు చేసిన రేకుల షెడ్

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు గోడను పగులగొట్టి దర్జాగా రేకుల షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. నాలుగు దశాబ్దాల కిందట మాచర్ల- గుంటూరు రహదారిపై ప్రయాణికులకు అనుకూలంగా ఉండేందుకు ఆర్టీసీ షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. రెడ్డిగూడేనికి చెందిన టీడీపీ నాయకుడు మంగళవారం రాత్రి షెల్టర్ గోడను పగలగొట్టి రేకుల షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. గ్రామస్తులు అడ్డుపడి అడిగినా '' నాఇష్టం.. మీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోండి'' అని బుకాయించాడు.చేసేది లేక గ్రామస్తులు మిన్నకుండిపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఆక్రమదారుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సేవా భావమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంకొండ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండడమే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) లక్ష్యమని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవాభావం అంటే వేల రూపాయలు దానం చేయాల్సిన పని లేదన్నారు. మనకు చేతనైన దానిలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలలో పాల్గొంటే సరిపోతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులైన పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు , పాఠశాలల్ని సొంత ఆస్తులుగా భావించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దేశానికి గ్రామాలు పట్టు కొమ్మలని మహాత్మా గాంధీజీ చెప్పారని ఆమె గుర్తు చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే నిజమైన స్వచ్ఛ భారత్‌ను సాధించగలుగుతామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారి లక్ష్మీ సులోచన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఏడాదికి ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, వై. రమేష్ బాబు, సాంబశివరావు, కుసుమ కుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలునాయక్ పాల్గొన్నారు.

విజయవాడలో 1000 కుటుంబాలకు సహాయం

- సహాయం చేసిన వారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన సహాయంతో విజయవాడలో వరదలకు నష్టపోయిన సుమారు 1000 కుటుంబాల వారికి నిత్యావసరాలు అందజేయటం జరిగిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తన గృహంలో మీడియాతో మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వాంబే కాలనీలో సుమారు 800 కుటుంబాల కు నిత్యావసరాలు, దుప్పట్లు అందజేశామన్నారు. వారందరూ చాలా సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఇప్పటి వరకు వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని, సహాయం చేయటంలో కూడా పార్టీలు చూస్తున్నారని బాధితులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అలాగే సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్ కాలనీ వద్ద మరో 200 కుటుంబాలకు అందజేశామన్నారు. దీనికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

సహాయం చేసిన నాయకులు, కార్యకర్తలు

ఎస్.సుజాతపాల్, అన్నం శివాచౌదరి, కట్టా బుజ్జి, సయ్యద్‌సిలార్ భాష, వరవకట్ట చిన్నబుజ్జి, 30వ వార్డు షేక్ రెహమాన్, రెండోవార్డు వార్డు తిప్పర య్య, కందుల ఎజ్రా, కుక్కల పోలు, మాగులూరి రమణారెడ్డి, సానికొమ్ము రమణారెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, సానికొమ్ము కోటిరెడ్డి, ఎనికె ఆంజనేయు లు, జమ్ముల రాధాకృష్ణ, పూనూరి కోటిరెడ్డి, మరిపూడి రాంబాబు, బొమ్మ కృష్ణారెడ్డి, మురబోయిన సుబ్బాయమ్మ, మూరె రవీంద్రారెడ్డి, వెన్నపూస నాగిరెడ్డి, ఉప్పలపాడు వెంకటరెడ్డి, అన్నవరప్పాడు రామిరెడ్డి, బుచ్చి బాపనపాలెం పుల్లారెడ్డి, ఊరా భాస్కరరావు, గురవాయపాలెం వసంతరావు, రెడ్డినగర్ ఇల్లూరి వీరరాఘవరెడ్డి, మాలపాటి తిరు పతిరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, మస్తాన్ రెడ్డి, రావిపాడు గొల్లపూడి బాలరాజు, లక్కపోగు బుజ్జి, బక్క మస్తాన్, చింత్రాల నాగార్జున, నటరాజ్, దివ్వెల రామకృష్ణ, ఏటీసీ పంతులు, వీరం భాస్కర్‌రెడ్డి, పచ్చవ రవి, పోతులూరి సుబ్బారెడ్డి, నిడమానూరి సురేంద్ర, కేపీ రంగారావు, స్వామి మాస్టర్, టి. నరేష్, చింతగుంట్ల రఘు రామిరెడ్డి బ్రదర్స్ (హోలీ వుడ్ రఘు) ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లులతో చిరుధాన్యాలతో వంటకాలు చేయించారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.ఎ స్.కె. సుజాత, జి. వాణి, జి.ఎస్.ఎన్.జ్యోతి, గౌసియ, డి.అమల, జి.బుజ్జి, హెచ్‌వీ సంపూర్ణాదేవి, కౌసల్య, తల్లులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

దమ్మాలపాడు(ముప్పాళ్ల): పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి పరిధిలోని దమ్మాలపాడు ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై వ్యాస రచన, క్విజ్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మావతి, డి.బుజ్జిరాణి, టి.ప్రమీల, డి.రమాదేవి, సీహెచ్.సుమలత, ఎల్.శ్రీదేవి, ఆయాలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సత్తెనపల్లి: పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సత్తెనపల్లి పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి సిబ్బందితో కలసి మంగళవారం దాడులు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని 31వ వార్డు శివారు పొలాలలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మాస్టర్ ప్లాన్ అప్రూవల్ చేయించండి

నూతన కమిషనర్‌ను కోరిన మున్సిపల్ లైసెన్స్‌డ్ సర్వేయర్ ఇంజినీర్లు



నరసరావుపేట: పురపాలక పరిధిలో కలిసిన ప్రాంతాల్లోని స్థలాలకు పన్నులు వేయాలని, మాస్టర్‌ప్లాన్ అప్రూవల్ చేయించాలని మున్సిపల్ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు నూతన కమిషనర్ ఎం.జస్వంతరావును కోరారు. పురపాలక కమిషనరుగా సోమవారం బాధ్యతలు చేపట్టిన కమిషనరును బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డి సారథ్యంలో అసోసియేషన్ ఇంజినీర్లు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియచేశారు. పురపాలక అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఇంజినీర్స్ అసోసియేషన్ ఛైర్మన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్‌సింగ్, అధ్యక్షులు ఆర్.బ్రహ్మయ్య, కోశాధికారి అనిల్, ఉపాధ్యక్షులు వెంకట్‌నారాయణ, కార్యనిర్వహక కార్యదర్శి ఆంజనేయులు ఇంజనీర్లు పాల్గొన్నారు.

గాన గంధర్వుడికి ఘన నివాళి



నరసరావుపేట ఈస్ట్: గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం నాల్గవ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణ కళాకారులు ఘన నివాళులర్పించారు. ప్రకాష్‌నగర్ టౌన్‌హాల్‌లోని ఎస్పీ బాలు విగ్రహానికి పూలమాలలు వేసి గాయకునిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. శ్రీనరసరావుపేట కళావేదిక వ్యవస్థాపకుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మంజీరా మెలోడీస్ గాయకుడు కొఠారి రంజిత్‌కుమార్, శ్రీనాథ సాహితీ పరిషత్ అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.